# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### మూడు గంటలిత్తే ఎకరం గూడా పారదు

పీసీసీ అధ్యక్షుడు ఎవుసానికి మూడు గంటల కరెంటు సాలంటున్నడు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నడు. దీంతోటే అర్థమవుతున్నది ఆయనకు రైతుల బాధలు తెలియదని. మూడు గంటల కరెంట్‌తో ఎకురం గూడా సక్కగా పారదు. ఇగ పెద్ద మోటర్ పెట్టుకోవాలంటే రైతుందరూ ఖర్చుపాలు కాకతప్పదు. ఒకొక్కరి మీద లక్ష రూపాయల భారం పడుతుంది. ఇప్పుడు కరెంట్ ఇస్తున్న పద్ధతి మంచిగున్నది. అనవసరంగా హస్తం పార్టీ నాయకులు రైతులను ఆగం చేయద్దు. నాలుగు ఓట్ల కోసం అడ్డం పొడుగు మాట్లాడద్దు. రైతులను ముంచేందుకు కుట్రలు చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతం.

**- గాజుల ప్రసాద్ రైతు, నవాబ్ పేట(రామగిరి)**



### కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ కనుమరుగే..

తెలంగాణలో పంటలు మంచిగ పండుతున్నయి. కేసీఆర్ సార్ 24 గంటల కరెంట్‌తో రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నడు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పొలాలకు నీళ్లు రాక, సరిపడా కరెంట్ లేక అనేక ఇబ్బందులు పడ్డం. కానీ సీఎం కేసీఆర్ రైతుబంధు, ఉచిత కరెంట్ ఇచ్చి ఎవుసాన్ని పండుగ జేసిండు. గిసోంటి టైంల ఎటువంటి పొరపాటు జేయం. కాంగ్రెస్ వస్తే ఉచిత కరెంట్ కనుమరుగవుతుంది. మళ్లా రైతులకు కష్టాలే మిగులుతయ్.

**- తాండ్ర తిరుపతి, రేగడిమద్దికుండ(సుల్తానాబాద్)**



### రేవంత్‌రెడ్డికి ఎవుసం గురించి ఏం తెలుసు?

పట్నంల భూములమ్ముకుంట. అమాయకులను బెదిరించుకుంట పైసలు దొబ్బే రేవంత్‌రెడ్డికి ఎవుసం గురించి ఎం తెలుసు..ఎన్నడన్నా నాగలి పట్టిండా. పొలందున్నిండా.. ఇప్పుడు ఎన్నికలు రాంగనే నోటికచ్చినట్లు అరుస్తున్నడు. రైతుల పక్షపాతి అయినా కేసీఆర్‌ను ఇష్టమొచ్చినట్లు తిడుతున్నడు. ఆయన ఇత్తానన్న మూడు గంటల కరెంట్‌తో ఒక్క దొయ్య కూడా పారదు. 10 హెచ్‌పీ మోటర్ పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతయ్. మోటర్లు గూడా కాలిపోతయ్. ఇదంతా ఆయనకేం ఎరుకా..రైతులు ఓట్లతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నరు.

**-మామిడాల మార్కండయ, ఎన్టీపీసీ మల్కాపూర్ రైతు (జ్యోతినగర్)**




### నిర్మల మాటలతో కాంగ్రెస్ కుట్ర తెలిసింది

తెలంగాణలో మోటర్లకు మీటర్లు పెట్టనందుకే కేంద్రం నిధులు ఇవ్వలేదని కేంద్ర మంత్రి నిర్మల సీతారాం చెప్పడం సరికాదు. దీంతో కేంద్రం తెలంగాణపై కక్ష చూపుతుందని అర్థమవుతున్నది. నిర్మలకు రైతుల బాధలు ఎం తెలుసని ఇట్ల ఇష్టమచ్చినట్లు మాట్లాడుతున్నరు. మీటర్లు పెడితే బిల్లులు భరించలేక అన్నదాతలు ఆగమైతరు. రైతుల పక్షపాతి అయిన సీఎం కేసీఆర్ మాకు 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. టైంకు రైతుబంధు పైసలిత్తున్నడు. రంది లేకుండా పంటలు సాగు చేసుకుంటున్నం. అందుకే ఈ సారి కూడా రైతులు బీఆర్ఎస్ పార్టీదిక్కే ఉంటం. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని మళ్లీ గెలిపించుకుంటం.

**- గుగులోతు దేవిలాల్, రైతు, లంబాడితండా(ఓదెల)**

# మీటర్లు పెట్టే కాంగ్రెస్ మాకెందుకు?



## ఒకలు మీటర్లు పెట్టుమంటరు

- వాళ్ల రాష్ట్రాల్లో ఒప్పందం చేసుకుంటరు
- ఇక్కడేమో పూటకో మాటతో పరేషాన్ చేస్తున్రు
- ఇన్ని రోజులు కేసీఆర్ చెప్తే ఏమో అనుకున్నం
- ఇప్పుడే మాకు అర్థమైతంది
- కాంగ్రెస్, బీజేపీని ఇంకా నమ్మి మోసపోం
- కరెంటిచ్చిన కేసీఆర్‌కే ఓటేస్తం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు



కరీంనగర్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కాంగ్రెస్‌కు ఓటేస్తే బాయిలకాడ మీటర్ల పెడుతరని మాకిప్పుడు అర్థమైంది. నిన్ననే బీజేపీ కేంద్ర మంత్రి నిర్మలమ్మ కుండబద్దలు కొట్టినట్టు చెప్పడం టీవీల్లో జూసినం. కాంగ్రెస్ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో బాయిల కాడ మీటర్లు పెట్టడానికి అక్కడి ప్రభుత్వాలు ఒప్పుకున్నట్లు వార్తలు జూసినం. ఒక్క కేసీఆరే దీన్ని వ్యతిరేకించినట్టు కేంద్ర మంత్రే చెప్పింది. పాపం కేసీఆర్ ఇన్నాళ్లూ మీటర్ల మాట చెప్తే ఏమో అనుకున్నం. కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాటలు నిజం కావొచ్చనుకున్నం. కానీ, ఇప్పుడు అసలు రంగు బయటపడ్డది. ఇంకా నయం. ఎలక్షన్ల తర్వాత అయితే మోసం జరిగేది' అని జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా తమ మంచికే జరిగిందని, ఇప్పుడు తమకు పూర్తిగా అర్థమైందని చెబుతున్నారు. రైతుల మీద కేసీఆర్‌కు ఎంతో ప్రేమ ఉన్నదని, తమ బతుకు దెరువు కోసం కేంద్రంతోనే కొట్లాడిన కేసీఆర్‌కు కాకుండా ఇంకెవరికి ఓటేస్తామని, బరాబర్ కారు గుర్తుకే ఓటేస్తామని స్పష్టం చేస్తున్నారు. 'అవ్వా ఇన్ని అబద్ధాలా..? మేం మీటర్లు పెడుతం అనలేదని బీజేపోళ్లు, మేం ఏ రాష్ట్రంలో మీటర్లు పెట్టడానికి ఒప్పుకోలేదని కాంగ్రెసోళ్లు ఇప్పటి వరకు చెప్పిన్రు. మమ్మల్ని నమ్మించే ప్రయత్నం చేసిన్రు. మాయమాటలతో మమ్మల్ని మోసం చేసేతందుకు చూసిన్రు. మరి ఇప్పుడు అసలు గుట్టు బయట పడ్డది' అని మండిపడుతున్నారు. ఇవన్నీ చూస్తే ఎవరేం చెప్పినా వినిపించుకునేది లేదని, తమకు 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా ఇస్తూ ఆసరా అవుతున్న కేసీఆర్‌కే అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కరెంటుతోపాటు బావుల కాడ మోటర్ల బిగింపు విషయంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలు బీజేపీ కాంగ్రెస్ వ్యవహార శైలిని బట్టబయలు చేసిన నేపథ్యంలో రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



### పెద్ద మోటర్ పెడితే ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోతది

నాకు మా ఊరిలో ఆరెకరాల భూమి ఉన్నది. అందులో వరి. పత్తి పంటలు సాగు చేస్తున్న. తెలంగాణ వచ్చినంక ఫుల్ కరెంట్ వస్తున్నది. ఎప్పుడు పడితే అప్పుడు పొలం దగ్గరికి పోయి నీళ్లు పెట్టు కుంటున్న. గతంలో తెల్లందాక బాయిల కాడ చెద్దర్లేసుకొని చలిల పండుకొని కావలి కాసేది. ఇప్పుడు ఆ గోస తప్పింది. కానీ కాంగ్రెసోళ్లేమో మూడు గంటల కరెంట్ ఇత్తమని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టు కొమ్మని బుద్ధి తక్కువ మాటలు చెబుతున్నరు. పెద్ద మోటర్లు పేలితే ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోతది. రైతులేం అమాయకులు కాదు. వారి మాటలు నమ్మేందుకు, ఎక్కడ గుద్దాల్లో గుద్దుతం. టైం అచ్చినప్పుడే వాళ్లకు బుద్ధి చెబుతం. మళ్లా మా కేసీఆర్‌నే తెచ్చుకుంటం.

**-మావురం సుధాకర్‌రెడ్డి. రైతు. జాఫర్‌ఖాన్‌పేట (కాల్వశ్రీరాంపూర్)**

### 10హెచ్‌పీ మోటర్లకు పైసలెవరు ఇత్తరు..

నాకు మూడెకరాల పంట భూమి ఉన్నది. వరి, పత్తి పండించుకుంటున్న. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ అంటున్నరు. అదే జరిగితే రైతుల బతుకుల్లో నిప్పులు పోసినట్లే. వాళ్ల పాలనలో కరెంట్ రాక చీకట్లో పొలాల గట్ల మీద పడుకున్నం. ఎందరో రైతులు పాము కాటుతో చచ్చిపోయిన్రు. బీఆర్ఎస్ సర్కార్ పంటలకు 24 కరెంట్ ఇస్తే వాళ్లకెందుకు కండ్ల మంట. రైతులను ఆగం చేస్తే మంచిగుండదు. కాంగ్రెస్ నాయకులు తలో మాట మాట్లడితే ఊకుండేది లేదు. పీసీసీ అధ్యక్షుడు ఇంకా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నడు. ఇందుకు మస్తు ఖర్చయితది. ఇందుకు పైసలేవరు ఇత్తరు..వానీ అయ్యిత్తడా..

**-గసిగంటి గంగయ్య, రైతు, బాలరాజ్‌పల్లి (జూలపల్లి)**



### వాళ్లస్తే కరెంట్‌ను కాట గలుపుతరు

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓసారి ఎవుసానికి మూడు గంటల కరెంట్ సాలంటడు. మళ్లా బుకాయించి ఓట్ల కోసం 24 గంటలు ఇత్తమంటున్నడు. ఇంకోసారి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొమ్మని ఉద్దెర ముచ్చట జెపుతున్నడు. ఆయన పూటకో మాట మాట్లడుతున్నడు. ఏ ఎండకు ఆ గొడుగు పడుతున్నడు. ఆయనకు ఓ పద్ధతి లేదు. కాంగ్రెస్‌కు ఓ విధానం లేదు. వాళ్లు వస్తే కరెంట్‌ను కాట గలుపడం గ్యారెంటీగా కనబడుతున్నది. అందుకే వారికి ఓటేయ్యం. మా బాధలు తీరుస్తున్న కేసీఆర్ సారునే తెచ్చుకుంటం.

**- చొప్పరి మల్లయ్య, భోజన్నపేట, పెద్దపల్లి**

### మూడు గంటలిచ్చేటోళ్లు మాకద్దు

నాకు 20 ఎకరాల భూమి ఉన్నది. అందులో పత్తి, వరి, మిర్చి పంటలు సాగు చేస్తా. ఇప్పుడు 24 గంటల ఫ్రీ కరెంట్‌తో రంది లేకుండా పంటలు పండించుకుంటున్న. కానీ ఎన్నికలు రాగానే కాంగ్రెసోళ్లు రైతులకు ఇది చేస్తాం. అది చేస్తాం. చందమామను తెచ్చిత్తం అని చెబుతున్నరు. ఇగ రేవంత్‌రెడ్డి తేలిసి తెల్వని ముచ్చట్లు జెబుతున్నడు. 3 సాగుకు మూడు గంటల కరెంట్ చాలని..రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని సలహాలిత్తున్నడు. ఆయనకు ఎవుసం గురించి తెల్వదని అట్టిగనే అర్థమవుతున్నది. అందుకే రైతు లేవరూ ఆయన మాటలు పట్టించుకుంటలేరు. కిరికిరి ముచ్చట్లు నమ్మేటోళ్లు లేరు. మళ్లా కారు గుర్తుకు ఓటేసి సీఎం సారును గెలిపించేందుకు సిద్ధంగా 3గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ మాకద్దు.

**-బూసి సదాశివరెడ్డి. రైతు. మల్యాల. (కాల్వశ్రీరాంపూర్)**



### హస్తం గుర్తుకు ఓటస్తే చీకటి రాజ్యమే

ఇప్పుడు రాత్రనక, పగలనక కరెంట్ ఉంటున్నది. పొలాలకు ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు నీళ్లు పెట్టుకుంటున్నం. పడావుపడ్డ భూముల్లో కూడా పంటలేసుకున్నం. రైతులందరూ సంతోషంగా ఉన్నరు. కానీ కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి మంచిగున్నదానిని కరాబు చేస్తా అంటున్నడు. ఓసారి మూడు గంటల కరెంట్ సాలంటున్నడు. ఇంకోసారి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాంటున్నడు. ఆయనను చూస్తే పచ్చబడ్డ రైతుల బతుకుల్లో నిప్పులు పోసేందుకు కుట్రలు చేస్తున్నడు. రైతులు గూడా ఆలోచించాలి. కాంగ్రెస్ వస్తే రాజ్యం చీకటి అవుతుందని గమనించాలి. మనకు మంచి జేత్తున్న కారు గుర్తుకే ఓటు గుద్దాలి.

**- మూల రవీందర్‌రెడ్డి, రైతు, నాగారం గ్రామం, మంథని రూరల్.**







### ధరణి తీసేస్తే పైరవీకారులు మళ్లత్తరు..

ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌తో భూముల రికార్డులు భద్రంగా ఉన్నయ్. ఎప్పుడంటే అప్పుడు చూసుకొనే అవకాశం ఉన్నది. భూముల అమ్మకాలు, కొనుగోళ్లు అల్కగా జరుగుతన్నయ్. రిజిస్ట్రేషన్ కాంగనే పట్టా మార్పిడి జరిగిపోతున్నది. ఎవ్వనీ చేతికి పైసా గూడ ఇవ్వాల్సిన పనిలేదు. అంతా సాఫీగా పూర్తవుతున్నది. మ్యూటేషన్ సైతం వెంటనే పూర్తవుతుంది. ఎలాంటి కిరికిరి లేదు. కాంగ్రెస్ ఉన్నప్పుడు భూముల మార్పిడి కోసం ఆఫీసుల చుట్టూ తిరుగాల్సి వచ్చేది. అప్పుడు అంతా గందరగోళంగా ఉండేది. మళ్లీ ఇప్పుడు ఓట్ల టైంల రేవంత్‌రెడ్డి ఉన్న ధరణిని తీసేసి కొత్తది తెస్తామంటూ పిచ్చి మాటలు మాట్లడుతున్నడు. కొత్తది తెస్తే పైరవీకారులు మళ్లత్తరు. ఆయన వచ్చేదిలేదు. తెచ్చేది లేదు. రైతులందరూ తిరుగబడి తరిమికొట్టే రోజు దగ్గరిలోనే ఉన్నది.

**-తుమ్మ మర్రెడ్డి, రైతు, (పెద్దపల్లి)**

# ధరణి పోతే ఎన్కటి గోసే

- దళారీ దందా వస్తది.. భూములకు రక్షణ ఉండది
- రికార్డులు తారుమారైతయ్.. తగాదాలు మొదలైతయ్
- పైసా లేకుంటే పనికాదు.. నెలలు తిరిగినా కథ ఒడవదు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కర్షకలోకం
- కాంగ్రెస్‌ను నమ్మి పాత రోజులు తెచ్చుకోవద్దని సూచన

కరీంనగర్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'మునుపు భూమికి సంబంధించిన ఏదైనా దస్త్రం కావాలంటే మా దగ్గర లేదంటూ రెవెన్యూ వాళ్లు ముప్పుతిప్పలు పెటిన్రు. ఎవరికి చెప్పుకుంటవో చెప్పుకపో అన్నరు. ఏ అధికారి వద్దకు వెళ్లినా పని గాలే. ఏమన్నంటే ఆ దస్త్రాలు చినిగిపోయినవి అనేటోళ్లు. నిజాం కాలం నాటి రికార్డులు మా దగ్గర ఉంటయా..? అని బెదిరించేటోళ్లు' అని జిల్లా రైతులు నాటి పాలనలో పడ్డ గోసను గుర్తు చేసుకున్నారు. ధరణి వచ్చిన తర్వాత ఎవరి దగ్గరకు పోవాల్సిన అవసరం లేకుండా పోయిందని, రిజిస్ట్రేషన్ అయిన వెంటనే కాగితాలు వస్తున్నాయని, తమ పాస్‌బుక్కులు పట్టుకొని పోతే చాలు ధరణిలో చూసి లోన్లు ఇస్తున్నారని సంతోష పడుతున్నారు. స్వరాష్ట్రంలోనే తమ భూములకు భద్రత ఏర్పడిందని, గ్రామాల్లో జాగల కిరికిరి పోయిందని, ఉన్నదాంట్లో కొంత అమ్ముకుంటే.. వెంటనే మా పాస్‌బుక్కులో తగ్గి.. కొన్నోళ్ల పేరిట ఎక్కుతున్నదని, వాళ్లకు మ్యుటేషన్ అయితున్నదని చెబుతున్నారు. గతంలో అమ్మినోళ్ల భూమి నుంచి కట్ అయ్యేది కాదని, కొన్నోళ్లకు ఎక్కాలంటే నెలలు తిరగాల్సి వచ్చేదని, లంచాలు ఇవ్వనిదే పని అయ్యేది కాదని, ఇటు ఏ గ్రామంలో చూసినా భూతగాదాలే కనిపించేవని, అవి హత్యలకు కూడా దారితీసేవని అప్పటి రోజుల గురించి చెప్పారు. ఇప్పుడు అంతా మంచిగున్న సమయంలో కాంగ్రెసోళ్లు ధరణి ఎత్తేస్తామంటున్నారని మండిపడుతున్నారు. ధరణి ఎత్తేస్తే ఎన్కటి లెక్క దళారులే వస్తారని, మళ్లీ గొడవలు జరుగుతాయని, అరిగోస పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గురించి ఆలోచించి ధరణిని తెచ్చి భూములకు రక్షణ కల్పించి, గొడవలు లేకుండా చేసిన కేసీఆర్‌కు కర్షకలోకం అండగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.



### మళ్లా పాత కథ మొదలైతది..

ధరణి లేనప్పుడు భూములను అమ్మాలన్నా. కొనాలన్నా ఆఫీసుల పొంటి తిరుగాల్సి వత్తదనది మస్తు భయపడేది. కానీ కేసీఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి రైతుల బాధలు తీర్చింది. ఇప్పుడు భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్లు నిమిషాల మీద అవుతున్నయ్. రూపాయి లంచం ఇవ్వకుండానే పనులు అయితున్నయ్. అట్లనే సెల్‌ఫోన్ చేతిలుంటే చాలు మన భూమి గురించి ఎప్పుడంటే అప్పుడు చెక్ చేసుకోవచ్చు. కానీ కాంగ్రెస్ గింత మంచి ధరణిని రద్దు చేస్తానంటున్నది. వాళ్లకు అవగాహనలేకే ఇట్ల మాట్లాడుతున్నరు. అందుకే వాళ్లొస్తే పాత కథా మళ్లా మొదలైతది. అన్నదమ్ముల మధ్య లడాయిలు షురువైతయ్. రైతులు కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మద్దు. రైతులకు కేసీఆరే మంచి చేసిండు మల్లీ వస్తాడు.

**- గట్ల లక్ష్మిరాజం, రైతు, మూలసాల (పెద్దపల్లి)**

### అవస్థలు పెట్టే పట్వారీ వ్యవస్థ మాకొద్దు

మా పంట భూములకు ధరణి పోర్టల్ రక్షణగా నిలిచింది. మా భూములు యాడికి పోవని ధైర్యం వచ్చింది. కాంగ్రెస్ ధరణి తీసేసి భూమాత పెడతామంటున్నరు. అట్లయితే రైతుల భూమి హక్కులు గాల్లో కలిసిపోతయ్. పాత రోజులు మాకు యాదికున్నయ్. ఆ కష్టాలు పోవాలంటే ఆ పార్టీని పాతరేయాలే. రికార్డుల్లో మా భూముల వివరాలు పక్కా ఉన్నయని గెండెపై చేయి వేసుకుని పడుకుంటున్నమ్. కాంగ్రెస్ వస్తే రైతుల బతుకులు నాశనమైతయ్. రైతుల భూములు మాయం చేయడానికే కుట్రలు చేస్తున్నది. పాత కాలంలో లంచాలు తీసుకుని దొంగ నంబర్లు వేసి, ఫొటోలు మార్చి, నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు తయారు చేసిన్రు. రైతుల తలరాతలు తారుమరు చేసే పట్వారీ వ్యవస్థ మాకొద్దు.

**-సాగంటి శాంతం, రైతు, కుమ్మరికుంట (జూలపల్లి)**



### కుట్రలు చేస్తున్నరు



ధరణి అచ్చినప్పటి నుంచి భూముల లావాదేవీలు సక్కగా సాగుతున్నయ్. ఎన్నో ఎండ్ల సంది ఉన్న సమస్యలు పోయినయ్. రికార్డుల్లో భూమి భద్రంగా ఉన్నది. యజమాని వేలు ముద్రవేయనిదే ఇంకోకరి పేరు మీద ఎక్కే అవకాశం లేకుండా పోయింది. కానీ సోయి తప్పిన కాంగ్రెసోళ్లు మంచిగున్న ధరణిని బంగాళా ఖాతంల కలుపుతమంటు న్నరు. వాళ్ల రైతుల ఇబ్బందులు తెల్వకనే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతన్నరు. అయినా వాళ్ల వచ్చేది లేదు. తీసేది లేదు కానీ రైతులను ఆగంపట్టించేందుకే కుట్రలు జేత్తున్నరు.

**- గొర్ల కుమార్, రైతు, మడక (ఓదెల)**

### రైతుబంధు ఆగిపోతది



భూముల రికార్డులను ఆన్‌లైన్‌లో భద్ర పరిచేందుకు ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తెచ్చింది. రైతుల ఇబ్బందులను చూసి పట్వారీ, వీఆర్వో వ్యవస్థను ఎత్తేసింది. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు మళ్లా పాత పద్ధతి తెస్తమంటున్నరు. అంటే అధికారుల చేతికి కత్తిచ్చేందుకే కుట్రలు జేస్తున్నరు. ధరణి లేకుంటే భూముల పంచాయితీలు రగులుతయ్. పాలొండ్ల మధ్య పగలు పెరుగుతయ్. రైతుబంధు పథకం అగిపోతది. రైతుబీమా కూడా అందదు. రైతులు జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌ను తెచ్చుకొని నెత్తిన కుంపటి పెట్టుకోవద్దు.

**-కట్టెకోల సదానందం, రైతు, ఎక్లాస్‌పూర్ గ్రామం, మంథని.**



### భూములు కొల్లగొట్టేందుకే కుట్రలు

అంతకు ముందు మా అమ్మ పేరిట ఉన్న భూమిని మా ముగ్గురు అన్నదమ్ముల పేరిట ఎక్కించేందుకు చాలా తిప్పలు పడ్డం. చెప్పులరిగేదాకా ఆఫీసుల చుట్టూ తిరిగినం. మస్తు ఖర్చు పెట్టుకున్నం. అయినా పనికాలేదు. కానీ సర్కారు తెచ్చిన ధరణి పోర్టల్‌తో మా అమ్మ పేరిట ఉన్న భూమి మా పేరుమీదికి వచ్చింది. అదిగూడా అద్దగంటలోనే రిజిస్ట్రేషన్ చేశారు. ఆ వెంటనే కాగితాలు చేతికిచ్చిన్రు. వారం తిరుగకముందే వరిజినల్ పాసు బుక్కు పోస్టాఫీసుల ఇంటికి వచ్చింది. ఇందుకు ఎవ్వరికీ నయా పైసా ముట్టజెప్పలేదు. కానీ కాంగ్రెసోళ్లేమే గింత మంచి పోర్టల్‌ను బంగాళఖాతంల కలుపుతమని ఇష్టమొచ్చినట్లు నరుకుతున్నరు. భూములు కొల్లగొట్టేందుకే భూమాతను తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నరు.

**- మనాల నారాయణ, ఎన్టీపీసీ మల్కాపూర్ గ్రామ రైతు**